ఐక్యమత్యంతోనే అభివృద్ధి సాధ్యం

• బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

ఇచ్చోడ, ఫిబ్రవరి 27 : ఐక్యమత్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మంగళవారం బోరి గామ గ్రామంలో రెడ్డి సంఘం రెండో అంతస్తు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. సంఘం నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండ లాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సుభాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చోడ : ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి 27 : బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మంగళవారం ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిశారు. బోథ్ నియోజకవర్గంలోని పలు పెండింగ్ పనుల గురించి వివరించారు. ఇచ్చోడ నుంచి సొనాల వెళ్లే రోడ్డు మార్గంలో అడెగాం(కే), పిప్రి గ్రామంలో ఉన్న రోడ్డు సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి తప్పకుండా రెండు రోజుల్లో పరి ష్కరించేలా చూస్తామని చెప్పారని అన్నారు. నియోజకవర్గ సమస్యలు వివరించారు.

కళాశాలలో మాక్ పార్లమెంట్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : పార్లమెంట్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించినట్లు ప్రిన్సి పాల్ అనిత తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు ఆమె వెల్లడించారు. పార్లమెంట్‌లో ప్రధాని, మంత్రులు, ఎంపీలు ఎలా వ్యవహరిస్తారో విద్యార్థులు ప్రదర్శన చేపట్టి ఆకట్టుకున్నారు.

సీపీఐ సహాయ కార్యదర్శి పార్టీకి రాజీనామా

బోథ్, ఫిబ్రవరి 27 : బోథ్ మండల సీపీఐ పార్టీ సహాయ కార్యదర్శి షేక్ షాకీర్ అనివార్య కారణాల వల్ల మంగళవారం పార్టీకి రాజీనామా చేశారు. సీపీఐతో తనకున్న బంధం మరువలే నని, ఉద్యమాల ఓనమాలు నేర్పిన పార్టీతో ఇన్ని రోజులు పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నాని పేర్కొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి

భీంపూర్, ఫిబ్రవరి27 : పిప్పల్‌కోటి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర్య సమర యోధుడు, త్యాగధనుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని నిర్వ హించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహేశ్, ఉపా ధ్యాయులు శంకర్, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం పొందాలి

భీంపూర్, ఫిబ్రవరి 27 : గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనుబంధ పౌష్టికాహారం పొందాలని వైద్యాధికారి నిఖిల్ రాజ్ సూచించారు. భీంపూర్ పీహెచ్‌సీలో మంగళవారం 21 మంది గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. ప్రమాదభరిత లక్షణాలు ఉన్న ఇద్దరిని రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఈ శిబిరంలో హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ బింగి గంగాధర్, సిబ్బంది పూర్ణిమ, వివేక్, అశోక్‌రెడ్డి, సుజాత, జనాబాయి పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్యానోత్సవం

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ, శ్రీ రామ చంద్రమిషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు ధ్యానోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ జాదవ్ సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ధ్యానోత్సవం కార్యక్రమం ఈ నెల 28, 29, మార్చి 1 వరకు ప్రతి రోజూ 5.30 గంటలకు ఉచిత ధ్యానశిక్షణను రిమ్స్ ఆడిటో రియలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15 సంవత్సరాలు దాటిన వారందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

2కే రన్ ప్రారంభం

2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డీఆర్‌వో రాథోడ్ రమేశ్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీఆర్‌వో రాథోడ్ రమేశ్ పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను డీఆర్‌వో ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతర్గాం పాఠశాలకు ప్లేట్లు విరాళం

ప్రధానోపాధ్యాయుడికి ప్లేట్లు అందజేస్తున్న సాయి కుటుంబీకులు

భీంపూర్, ఫిబ్రవరి 27 : అంతర్గాం పాఠశాలకు కృష్ణసాయి జ్ఞాపకార్థం వారి తలిదండ్రులు రొక్కం కృష్ణవేణి , సంతోష్ 30 ప్లేట్లను విరాళంగా పంపించారు. వారి తరపున సంతోష్ అమ్మ లక్ష్మి మంగళవారం వాటిని ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌కు అందజేశారు. ప్రతి సంవత్సరం సాయి సంస్మరణలో తలిదండ్రులు సర్కారు బడికి చేయూత నివ్వడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యాయులు జయసారథి, ప్రేతమ్, సిబ్బంది లక్ష్మి, జబార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు.. రాకపోకలకు ఇబ్బందులు

ఇంద్రవెల్లిలో గుంతలమయమైన బీటీ రోడ్డు

నార్నూర్: అధ్వానంగా తయారైన బీటీ రోడ్డు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని అంజి గ్రామం నుంచి వడగాం, వాల్గొండా, హీరాపూర్, మారుతిగూడ, లాల్ టేకిడి గ్రామాల మీదుగా పోతున్న బీటీ రోడ్డు గుంతలతో అధ్వా నంగా మారింది. ఏ చిన్నపనైన గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనలతో పాటు ఆటోలు నడపడంలో తీవ్ర సమ స్యలు ఎదురైతున్నాయని ఆదివాసులు వాపోతున్నారు. అత్య వసర సమయంలో మండల కేంద్రానికి రావడానికి గంటల సమయం పడుతుందని వాపోతున్నారు. ఇప్పటికైన సంబం ధిత శాఖ అధికారులు పట్టించుకొని బీటీరింగ్ రోడ్డుకు మరమ్మ తులు చేయాలని కోరుతున్నారు.

నార్నూర్, ఫిబ్రవరి 27 : నార్నూర్ నుంచి గాదిగూడ మండ లంలోని గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యన గుంతల మయంగా మారిన బీటీరోడ్డుతో వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం గురించి పలుమార్లు అధికారులకు కోరిన పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. గుంతలు ఏర్పడిన ప్రదేశాల్లో రాత్రి వేళ ద్విచ క్రవాహనాలు జారీ పడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని వాహనదారులు, ప్రజలు కోరు తున్నారు.

పూర్తయిన వంతెన నిర్మాణం

కరంజి(టీ)- టేకిడిరాంపూర్ మధ్య నిర్మించిన బ్రిడ్జి

భీంపూర్, ఫిబ్రవరి 27 : కరంజి(టీ)- టేకిడిరాంపూర్ మధ్య గల పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.2.26 కోట్లు మంజూరు చేసింది. రెండు నెలల క్రితం వాగుపై వంతెన నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాల రాకపోకలకు సౌలభ్యమైంది. వాగుపై వంతెన నిర్మాణం లేక గత దశాబ్దకాలంగా వానకా లంలో సరిహద్దు గుబిడి, కొజ్జన్‌గూడ, టేకిడి రాంపూర్ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం కృషితోనే ఇన్నాళ్లు పడిన తమ కష్టాలు దూరమయ్యాయని గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆదిలాబాద్- కరంజి(టీ), కరంజి(టీ) నుంచి గుబిడి వరకు మొత్తం 40 కిలో మీటర్ల వరకు బీటీ రోడ్డును కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పుడు నిర్మాణాత్మ కంగా పనులు మొదలు కావాల్సి ఉన్నది.

పరీక్షా కేంద్రాల పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : ఇంట ర్మీడియట్ వార్షిక పరీక్షల కోసం పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఐఈవో రవీందర్ కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీ డియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో మంగళ వారం జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలిం చారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

నేటి నుంచి ఈత కొలను ప్రారంభం

ఆదిలాబాద్‌లోని ఈత కొలను

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఉన్న ఈత కొలను ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతుందని ఈత శిక్షకుడు కొమ్ము కృష్ణ తెలి పారు. మలీనమైన నీటిని తొలగించి కొత్త నీరును ఈత కొలనులో నింపామని, ఈ విషయాన్ని సాధకులు గమ నించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందు బాటులో ఉంటుందని పేర్కొన్నారు. సాధ కులు తప్పనిసరి తమ గుర్తింపు కార్డులను వెంట తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలి

మాట్లాడుతున్న సీఐ భీమేశ్

గుడిహత్నూర్, ఫిబ్రవరి 27 : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. గుడిహత్నూర్ మండలం మన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం విద్యార్థులు, పోషకులకు ఏర్పాటు చేసిన అవగహన సదస్సులో ఆయన మాట్లా డారు. చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్ల లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీఐ సూచిం చారు. క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్య క్రమంలో ఎంపీటీసీ న్యాను, విద్య కమిటీ చైర్మన్ మోహన్, బాలిక సంరక్షణ అధికారి సౌమ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319447-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

పర్దాన్ కులస్తులకు నామినేట్ పదవులు ఇవ్వాలి

మాట్లాడుతున్న హీరాసుక జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్వ నగేశ్, పూసం ఆనంద్‌రావ్

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : ఆదివాసీ పర్దాన్ కులస్తులకు వివిధ నామినేట్ పదవు లలో అవకాశాలు కల్పించాలని హీరాసుక జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్వ నగేశ్, పూసం ఆనంద్‌రావ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ పురోహిత్ సమాజ్ సంఘ భవన స్థలంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో వారు మాట్లాడారు. ఇంద్రవెల్లిలో నిర్వహించిన హీరాసుక జయంతి ఉత్సవాలు విజయవంతమైందని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరైన ఆదివాసీ పర్దాన్ కులస్తులు ,ఆదివాసీ తొమ్మిది తెగల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉద్యోగులు, ఉపాధ్యా యులు, రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేసినందన్నారు. కార్య క్రమంలో పర్దాన్ సమాజ్ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు మాడావి శంకర్, నాయకులు యాదవ్‌రావ్, మాధవ్, సుభాష్, జనార్దన్, రవి పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమం

కోర్టుకు హాజరైన తుడుందెబ్బ నాయకులు

బోథ్, ఫిబ్రవరి 27 : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ అన్నారు. సిరికొండ పోలీసులు తుడుందెబ్బ నాయకులపై పెట్టిన కేసులో భాగంగా మంగళవారం బోథ్ జూనియర్ సివిల్ జాడ్జి కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీ సామాజిక ప్రజా పోరాటం, న్యాయ పోరాటాలను కొనసాగిస్తా మన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందిం చాలని, లేని పక్షంలో జరిగే పరిణామాలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్, కుమ్రం యాదవ్ రావ్, పెందూర్ అమృత్, పాండు, అనిల్, భగవంత్ పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 27: తల మడుగు మండలానికి బదిలీపై వచ్చిన ఎంపీ డీవో శేఖర్, ఎంపీవో వినోద్‌ను మంగళ వారం బీఆర్ఎస్ మండల నాయకులు శాలు వాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజక వర్గ అధికారి ప్రతినిధి కిరణ్‌కుమార్, బీఆర్ ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్, అభిరాం రెడ్డి, అబ్దుల్లా, శ్రీనివాస్ రెడ్డి, రవికాంత్ పాల్గొన్నారు.

అధికారులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 27: తాంసి, తలమ డుగు మండలాల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్స వాన్ని నిర్వహించనున్నట్లు శ్రీకాంత్, నారాయణ తెలి పారు. మంగళవారం ముందస్తు సైన్స్ దినోత్సవంలో భాగంగా ఖోడద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, ఉపాధ్యా యులు లక్ష్మి, వాసుదేవ్, సత్యనారాయణ, సురేఖ, మమత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన మేళా

విజ్ఞాన మేళాను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి బీ హుస్సేన్

బోథ్, ఫిబ్రవరి 27: జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని బోథ్‌లోని వేదం పాఠశాలలో మంగళ వారం నిర్వహించిన విజ్ఞాన మేళాను జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి బీ హుస్సేన్, మండల విద్యాధి కారి భూమారెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన చంద్రయాన్-3, సోలార్ సిస్టం, బయోగ్యాస్, అగ్ని పర్వతం, వాటర్ సైకిల్ తదితర ప్రదర్శనలు మేళాలో ఆక ట్టుకున్నాయి. న్యాయమూర్తితో ఎంఈవో ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై అవగాహన ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో ఉదయ్‌రావ్

ఇచ్చోడ(సిరికొండ), ఫిబ్రవరి 27 : రానున్న పదో తర గతి పరీక్షలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కలిగి ఉండా లని ఇచ్చోడ, సిరికొండ ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావ్ అన్నారు. మంగళవారం సిరికొండ జడ్పీ ఉన్నత, ప్రాథ మిక పాఠశాలతో పాటు సుంకిడి, రాయిగూడ ఆశ్రమో న్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వార్షిక పరీక్షలను సాధారణ పరీక్షలాగానే రాయాలన్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరుకావాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సిరికొండ, రాయిగూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సునీల్, విజయ్ ప్రకాశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సొంతంగా రాసే విధంగా తయారు కావాలి

మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి ప్రణీత

జైనథ్, ఫిబ్రవరి 27: విద్యార్థులు ప్రతి పాఠ్యాంశంలోని అంశాన్ని అర్థం చేసు కొని, సొంతంగా రాసే విధంగా తయారు కావాలని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. మంగళవారం మేడిగూడ రోడ్ జిల్లా పరిషత్ పాఠశాలను డీఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ చదవడంలో బట్టి విధానంతో మార్కులు మెరుగుపర్చుకోలేమని, ఉన్నది ఉన్నట్లు మాత్రమే రాయగలరని అన్నారు. విషయంపై విశ్లేషణ శక్తి పెంపొం దించుకోవాలన్నారు. బట్టి విధానం స్వస్తి పలకాలన్నారు. ఆమె వెంట సెక్టోరియల్ అధికారి నారాయణ, ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిట్టే, జ్యోతి, మంజుష, సంతోష్, నాందేవ్, కృష్ణ మూర్తి ఉన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 27: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. ఆది లాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్‌లోని యూపీఎస్ మరాఠి మీడియం పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళాను మంగళవారం ఆమె ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన కళాకృతులను పరి శీలించి అభినందించారు. పనికి రాని వస్తువులతో అందమైన కళారూపాలను విద్యార్థులు తయారు చేశారన్నారు.

డీఎస్పీ జీవన్‌రెడ్డికి సన్మానం

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : ఆదిలాబాద్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎల్ జీవన్ రెడ్డిని మంగళవారం సీపీఎం నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన సమయంలో అను బంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘువులు, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, నాయ కులు అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారిణికి కాంస్య పతకం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 27: బజార్‌హత్నూర్ మండలానికి చెందిన రాథోడ్ వనిత ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు రాంచిలో నిర్వహించిన ఉషు కేలో ఇండియా జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించింది. గతంలో తమిళనాడులో జరిగిన సౌత్ జోన్ సెలక్షన్‌లో వెండి పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. రాథోడ్ వనిత 75 కిలోల వేట్ కేటగిరీలో పాల్గొన్నారు. పతకం సాధించిన రాథోడ్ వనితను ఉషు అసోసియేషన్ ఇండియా సీఈవో సహెల్ అహ్మద్, ఆమేచర్ ఉషు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీ అబ్దుల్ ఉమర్, కోచ్ వీరేశ్ అభినందించారు.


కాంస్య పతకం సాధించిన రాథోడ్ వనిత

తెల్లజొన్న సాగుపై రైతుల ఆసక్తి


పంటను పరిశీలిస్తున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 27 : తెల్ల జొన్న పంట సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మంగళవారం తలమడుగులో రమాకాంత్ రైతు యాసంగిలో సాగు చేస్తున్న తెల్ల జొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలో తెల్లజొన్న పంట గతంలో 38 వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 62,623 ఎకరాల్లో సాగు చేస్తున్నారని తెలిపారు. మరో పక్క కౌలు రైతులు, పోడు వ్యవసాయం చేస్తున్న రైతులను పరిగణలోకి తీసుకొని వ్యవసాయ శాఖ అధికారులు అమ్ముకునే సమయంలో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మిత్ర ఫీల్డ్ కోఆర్డినేటర్ రమా కాంత్, స్వామి, గంగన్న, రవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలి

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 27: మండలంలో చేపడు తున్న అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీవో శేఖర్ అన్నారు. మంగళవారం కోసాయి గ్రామంలో చేపడుతున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని, నర్సరీ, డ్రైనేజీలను పరిశీలిం చారు. రోడ్లపైకి మరుగునీరు, రాకుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో వినోద్, నాయకులు స్వామి, నారాయణ ఉన్నారు.